

గర్భిణులకు ప్రశాంతత, ఆరోగ్యం ముఖ్యం

డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు

ఆకివీడు: గర్భిణులు చక్కని ఆరోగ్యంతో ప్రశాంతంగా ఉండాలని, ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు సూచించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ పక్షోత్సవంలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బాలింతలకు అన్నప్రాసన, సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. ఐసిడిఎస్ జిల్లా అధికారి పి.సుజాతరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ తల్లులు తగిన జాగ్రత్త తీసుకుంటే గర్భస్థ శిశువుకు ఆరోగ్యం, మేధస్సు సమర్థంగా ఉంటాయని సూచించారు. అనంతరం పసి పిల్లలకు అన్నప్రాసన, బాలింతలకు సీమంతం చేసి సారె అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ వాణిరత్నం, సూపర్‌వైజర్ రత్నకుమారి, టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన బొల్లా వెంకట్రావు, వీరశ్వేత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సొమ్ములివ్వరు.. గూడు చూపరు..!


నూజివీడులో నిరుపయోగంగా ఉన్న టిడ్కో ఇళ్లు

- 2014-19లో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ బకాయిలపై సర్కార్ దొంగాట
- రెండు జిల్లాల్లో రూ.81.65 కోట్లు బకాయిల కోసం ఎదురుచూపులు
- రెండు జిల్లాల్లో నిరుపయోగంగా వేల సంఖ్యలో టిడ్కో ఇళ్లు
- ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. చేతలకు పొంతన కరువు
- కూటమి వచ్చి ఏడాది గడుస్తున్నా లబ్ధిదారులకు దక్కని న్యాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు.. ఆచరణకు పొంతన లేకుండాపోయింది. ముఖ్యంగా గృహ నిర్మాణాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారింది. నష్టపోయిన గృహ నిర్మాణదారులకు న్యాయం చేయని పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్య టిడిపి పాలనలో ఎన్‌టిఆర్ గృహనిర్మాణ పథకం కింద ఏలూరు జిల్లాలో 28,840, పశ్చిమలో 25,855 ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఉన్న చిన్నపాటి ఇంటిని పడగొట్టి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. దీనిలో రూ.లక్షన్నర కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులకు మొదటి విడత, మరికొంత మందికి రెండోవిడతగా కొంత సొమ్ము జమ చేయడం తప్ప పూర్తిస్థాయిలో సొమ్ము జమ చేయలేదు. చాలామందికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి అందలేదు. 2019 ఎన్నికలకు ముందు ఇళ్ల బకాయిలు జమ చేస్తామని చెప్పినా అప్పట్లో టిడిపి ప్రభుత్వం చేయలే దు. తర్వాత జరిగిన ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఓటమి పాలైంది. అధికారంలోకి వచ్చిన వైసిపి సర్కార్ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గురించి పట్టించుకోలేదు. దీంతో ఏలూరు జిల్లా పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న 26,840 మంది లబ్ధిదారులకు రూ.40.90 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 మంది లబ్ధిదారులకు రూ.40.75 కోట్లు మొత్తం రూ.81.65 కోట్లు సొమ్ములు చెల్లించలేదు. దీంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఎన్‌టిఆర్ గృహనిర్మాణ బకాయిలు వెంటనే చెల్లిస్తామని గడిచిన ఎన్నికల్లో కూటమి నేతలు తెలిపారు. సర్వే చేసి బకాయిల లెక్కలు సైతం తేల్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఇప్పటికీ ఒక్క రూపాయి బకాయి సొమ్ము చెల్లించలేదు. బకాయిల సొమ్ము కోసం లబ్ధిదారులకు ఎదురుచూపులే మిగిలాయి. ఇంటి బకాయి సొమ్ము ఇవ్వకపోవడంపై లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

టిడ్కో ఇళ్ల కోసం ఎదురుచూపులే

2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో పెద్దఎత్తున టిడ్కో ఇళ్లను నిర్మించింది. చాలా ఇళ్లు దాదాపు 80 నుంచి 90 శాతం వరకూ పనులు పూర్తయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుబెట్టింది. టిడ్కో ఇళ్లకు సంబంధించి మిగిలిన పనులను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు లేకుండాపోయాయి. కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టిడ్కో ఇళ్ల కోసం లబ్దిదారులు కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొత్తం 11,816 టిడ్కో ఇళ్లను నిర్మించేందుకు అనుమతి ఇచ్చారు. 2,208 టిడ్కో ఇళ్లు 75 శాతానికిపైగా పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తిచేసి లబ్దిదారులకు అప్పగించకుండా అలానే వదిలేశారు. నూజివీడు టౌన్‌లో 2,640 ఇళ్ల వరకూ నిర్మించారు. మిగిలినవి పూర్తి చేసి ఇవ్వలేదు. జంగారెడ్డిగూడెంలో 937 టిడ్కో ఇళ్లు 90 శాతం వరకూ పూర్తయ్యాయి వాటి పరిస్థితీ అంతే. తాడేపల్లిగూడెం పట్టణంలో 5,376 టిడ్కో ఇళ్లకుగాను 650 ఇళ్లు మాత్రమే లబ్ధిదారులకు అందించారు. మిగిలినవి అలానే ఉన్నాయి. భీమవరం పట్టణంలో 9,600 టిడ్కో ఇళ్లకుగాను కొన్ని లబ్ధిదారులకు అందించారు. ఇంకా ఇవ్వాల్సిన ఇళ్లు అలానే ఉండిపోయాయి. మిగిలిన పట్టణాల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. గృహాలకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి ఎంఎల్ఎ వ్యాఖ్యలను ఖండించండి

నేడు జిల్లావ్యాప్తంగా నిరసనలకు పిలుపు

బెదిరిస్తే కమ్యూనిస్టులు బెదిరిపోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా సిపిఎం చేస్తున్న న్యాయమైన పోరాటంపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించిన తీరు చాలా దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ గట్లపై ఉన్న పేదల వల్లే నీరు కలుషితమవుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆయన కోరినట్లుగానే ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ వేసి పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతాయని అన్నారు. ఈ మేరకు గోపాలన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం చెబుతుంటే రఘురామకృష్ణరాజు కూల్చే పనిలో బిజీగా ఉన్నారని, ప్రభుత్వం ఆయన్ను నియంత్రిస్తుందా లేదా అనేది తేల్చాలని పేర్కొన్నారు. కూల్చిన ఇళ్లకు ప్రత్యామ్నాయం చూపించామని చెబుతున్నారని, ఆ వివరాలు బహిర్గతం చేయాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన వారిని అక్కడికే తరలించొచ్చుకదా అని, వారిని ఎందుకు రోడ్డు మీద వదిలేశారని ప్రశ్నించారు. రోడ్డు మీద పడ్డ జనానికి కనీసం తాగునీరు, తిండి, నీడ కల్పించలేదు. ఇదేనా మానవత్వం, మంచి ప్రభుత్వం అని నిలదీశారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శిపై ఆయన వాడిన భాష సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఆయన తిట్లు, శాపనార్థాల వల్ల కమ్యూనిస్టులకు పోయేదేమీ లేదని తెలిపారు. ఎంఎల్ఎ అసలు రూపమేమిటో ప్రజలకు అర్థమవుతుందని, బతికిపోయావ్.. పో అంటూ చంపుతామన్న బెదిరింపు ధోరణితో మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు. తిట్టినా, చంపినా కమ్యూనిస్టులు బెదిరిపోరని, పేదలకు న్యాయం జరిగే వరకూ పోరాడతారని తెలిపారు. అదే పాలకోడేరులో బడా భూస్వాముల ఆధీనంలో అక్రమంగా ఉన్న ప్రభుత్వ భూములు, కొబ్బరి చెట్ల గురించి మాట్లాడకపోవడం ఎంఎల్ఎ ఎవరి తరపున మాట్లాడుతున్నారో అర్థమవుతోందని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన మాట ప్రకారమే తాను పని చేస్తున్నానని చెబుతున్న రఘురామకృష్ణరాజు పేదల ఇళ్లు కూలుస్తానని ఎప్పుడూ చెప్పారో వివరించాలని డిమాండ్ చేశారు. రఘురామ కృష్ణరాజు భాష, అహంకారపూరిత వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25వ తేదీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా అన్ని మండల, పట్టణాల్లో నిరసనలు, ఆందోళనలు తెలపాలని గోపాలన్ పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో సిపిఎం శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఆశాలకు కనీసం రూ.26 వేలు అందించాలి

ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ఆశా వర్కర్ల జిల్లా సదస్సులో ఎంఎల్‌సి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న ఆశా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు వేతనం అందించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న ఆశా వర్కర్లను క్రమబద్ధీకరించాలన్నారు. ఆశా వర్కర్ల వ్యవస్థ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన దినోత్సవం పురస్కరించుకుని స్థానిక త్యాగరాజు భవనంలో ఆశా వర్కర్ల జిల్లా సదస్సు చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆశా కార్యకర్తలు అనేక పోరాటాలు నిర్వహించారని, తద్వారా కొన్ని హక్కులు సాధించుకున్నారని అభినందించారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఆశా కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆశాలపై యాప్‌ల పేరిట పెంచిన పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుటీ, కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ లేవని అన్నారు. ఆశాలతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తల సౌకర్యాలపై కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తోందని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం కాల రాస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశాలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, ఎ.అజయకుమారి మాట్లాడుతూ కార్మికులు ఐక్య పోరాటాలకు సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కులు కాపాడుకోవడం కోసం జరిగే పోరాటాల్లో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి, ఎల్ఎస్.కుమారి, మహ్మద్ సిరి బేగం, ఎన్.ప్రశాంతి, ఎ.జయంతి, పి.రాజేశ్వరి పాల్గొన్నారు.

వేసవి అలవెన్స్ పునరుద్ధరించాలి : వ్యకాస



మాట్లాడుతున్న సోమరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రద్దు చేసిన సమ్మర్ అలవెన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా గురువారం తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల గ్రామంలో పర్యటించి ఉపాధి పని ప్రదేశంలో కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ అలవెన్స్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుంకర సత్యవతి, మళ్లీ నాగమణి, చదలవాడ సూరిబాబు, వారా భాస్కరరావు, కండెల్లి శ్రీను, వారా వెంకటరావు, మిద్దె రామాంజనేయులు, గూడవల్లి పద్మ, ఎం.నాగముని పాల్గొన్నారు.


పాలకోడేరు: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షులు శేషపు అశ్రియ్య డిమాండ్ చేశారు. విస్సాకోడేరులో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతాన్ని ఆయన గురువారం సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు అనేక సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అశ్రియ్య మాట్లాడుతూ పనిచేసే చోట ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నప్పటికీ ప్రభుత్వం కనీస ఉపశమన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కూలీలందరికీ 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు.

జిల్లాకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చేతుల మీదుగా అందుకున్న డిపిఒ అరుణశ్రీ

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపిఒ బి.అరుణశ్రీ గురువారం విజయవాడలో డిప్యూటీ సిఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో రెండు అవార్డులు అందుకున్నారు. జిల్లాలో పన్నుల వసూళ్లు అధికంగా చేసినందుకుగాను ఒక అవార్డు, ఇంటింటా చెత్త సేకరణ, పరిశుభ్రమైన గ్రామం కేటగిరీలో మరో అవార్డు జిల్లాకు లభించాయి. ఈ సందర్భంగా డిపిఒ అరుణశ్రీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా అధికార యంత్రాంగం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారాలు తన బాధ్యతను మరింత పెంచాయని డిపిఒ అరుణశ్రీ తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, వివిధ శాఖల రాష్ట్రస్థాయి అధికారుల సమక్షంలో డిపిఒ అరుణశ్రీ అవార్డులు అందుకున్నారు.



పురస్కారాలు అందుకుంటున్న డిపిఒ అరుణశ్రీ

'పది' విద్యార్థులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - భీమవరం


ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి మెరుగైన ఫలితాలను సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల 10 మంది విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాలకు సంబందింధి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో చదివితేనే మెరుగైన ఫలితాలను సాధిస్తామనేది నిజం కాదని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరూపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. 500కుపైగా మార్కులు సాధించిన 1,485 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మండల సూరిబాబు డిమాండ్ చేశారు. భీమవరం కలెక్టరేట్ వద్ద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు వెంటనే పునరుద్ధరించాలన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఇల్లు కట్టుకుంటే లోన్లు ఇవ్వాలన్నారు. కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పసుపులేటి సత్తిబాబు, నూకల సత్తిబాబు, కొండ దూరం ప్రసాద్, బోలం ప్రసాద్, డోలం ప్రసాదు, పొట్టిపోతుల మధుసూదన్‌రావు, మనోహర్ పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ఉగ్రదాడులను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - ఆకివీడు

కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కలెక్టర్, ఎంఎల్ఎ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీతో నిరసన తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తొలుత కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణి, ప్రముఖ సినీ నటుడు రావు రమేష్, టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ బొల్లా వెంకట్రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఉండి: కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు నిరసనగా గురువారం రెండోరోజు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆధ్వర్యాన మౌనదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నేతలు ఆరెపల్లి వెంకటేష్, యడవిల్లి వెంకటేశ్వరరావు, యర్రా రవి, కుచ్చు శివకృష్ణ, సుబ్బరాజు, అడపా గణేష్, కంకణాల బాలకృష్ణ, షేక్ నదీమ్ పాల్గొన్నారు.

ఎఎస్ఆర్ నగర్‌లో కొనసాగిన భోజన శిబిరం

ప్రజాశక్తి - పాలకోడేరు

ఎఎస్ఆర్ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన భోజన శిబిరం రెండో రోజు గురువారం కొనసాగింది. ఇళ్లు కూల్చేసిన ప్రాంతాన్ని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జిల్లా కన్వీనర్ జక్కంశెట్టి వెంకటలక్ష్మి పరిశీలించి మహిళలతో మాట్లాడారు. ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లపై ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు చూపిస్తున్న ప్రతాపం ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న పెద్దలపై ఎందుకు చూపించడం లేదో చెప్పాలన్నారు. ఇక్కడ పేదలందరికీ ప్రత్యామ్నాయ స్థలాలిచ్చామని ఎంఎల్ఎ చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పేదలకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య, పాల్గొన్నారు.


శిబిరంలో భోజనాలు చేస్తున్న పేదలు

భీమవరంలో కెకె స్టోర్ ప్రారంభం

సందడి చేసిన సినీనటి అనసూయ

భీమవరం టౌన్: భీమవరంలో సినీనటి, ప్రముఖ యాంకర్ అనసూయ సందడి చేశారు. గురువారం స్థానిక పీపీ రోడ్డులోని కెకె స్టోర్ వస్త్ర దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. అనసూయను చూసేందుకు పెద్దసంఖ్యలో అభిమానులు తరలొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను భీమవరం చాలాసార్లు వచ్చానని, ఇక్కడి ప్రజల అభిమానం ఎప్పటికీ మరవలేనని, ఎన్నిసార్లు అయినా భీమవరం వస్తానని తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సతీమణి దేవి, స్టోర్ మేనేజర్లు కిషోర్, కెఎస్ఆర్.కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.


కెకె షోరూంను ప్రారంభించిన సినీనటి అనసూయ

నేటి నుండి మార్టేరు-పెనుగొండ రోడ్డు మూసివేత

నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం, పెనుగొండ వంతెన మరమ్మతుల నిమిత్తమే

జూన్ 11 నుంచి మళ్లీ రాకపోకలు పునరుద్ధరణ

పెనుమంట్ర: నెగ్గిపూడిలో కల్వర్టు నిర్మాణం, పెనుగొండలో వంతెన మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25 నుంచి జూన్ 10వ తేదీ వరకూ మార్టేరు–పెనుగొండ మధ్య రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్అండ్‌బి ఇఇ ప్రసాద్ తెలిపారు. రూ.కోటీ నాలుగు లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ రీత్యా విశాఖపట్నం, రాజమండ్రి, రావులపాలెం వైపు వెళ్లే వాహనాలను మార్టేరు నుండి ఆచంట, సిద్ధాంతం మీదుగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే తణుకు, పెరవలి, నిడదవోలు వైపు వెళ్లే వాహనాలు మార్టేరు నుండి ఆలమూరు, కంతేరు మీదుగా దారి మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకుని వీరవాసరం మండలంలో పలు సచివాలయాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన సచివాయం ఉద్యోగులను మండల పరిషత్ కార్యాలయ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురష్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులను, ఉన్నత ఉద్యోగులను మాత్రమే సత్కరించే ఆనవాయితీ కొనసాగుతున్న వేళ ఒక మండలంలో ఉత్తమ పని తీరు కనబర్చిన సచివాలయ ఉద్యోగులను కూడా సత్కరించాలన్న ఇన్‌ఛార్జి ఎంపిడిఒ అప్పారావు ఒక కొత్త ఆలోచనతో వీరవాసరం మండలంలో వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న ఐదుగురు సచివాలయ ఉద్యోగులను ఎంపిక చేసి మెమెంటో, శాలువతో సత్కరించారు. వీరవాసరం–1లో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఎవివి.విజయదుర్గ, వడ్డిగూడెం సిహెచ్ఎస్ఎన్‌వి.ప్రసాద్, మత్స్యపురిపాలెం, రాయకుదురు – 2 డిజిటల్ అసిస్టెంట్లు కె.దేవ, వివిఎస్‌జె.సత్యనారాయణమూర్తి, నందమూరుగరువు మహిళా పోలీసు బి.సంధ్యారాణిని సత్కరించారు. మండల ఉపాధ్యక్షుడు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసిలు అంగర కుటుంబరావు, కడలి నెహ్రూ, పెంటకోటి సైదేశ్వరరావు, మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్న సభలో వారు మాట్లాడారు. పంచాయతీ రాజ్‌శాఖలో సచివాలయ ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ సచివాలయ ఉద్యోగులను సత్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమణాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ అడబాల రేణుసాయి, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.


ఉత్తమ పనితీరు కనబర్చిన సచివాలయ ఉద్యోగులకు సత్కారం

పెనుమంట్ర : గ్రామాలను రోజూ శుభ్రంగా ఉంచడంలో నిత్యం శ్రమించే పారిశుధ్య కార్మికులు నిజమైన దేశభక్తులని జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ అన్నారు. గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి కుచర్లపాటి మంగతాయారు, ఎంపిటిసి నాగరాజు వెంకట్రామ రాజు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మండల సెకండ్, థర్డ్ 'వివేక' సొంతం

ప్రజాశక్తి - మొగల్తూరు


ఎ.లీలా మాధురి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వివేక ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆ పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యు.గీతారాంబాబు తెలిపారు. పబ్లిక్ పరీక్షలకు 37 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. మండలస్థాయిలో ద్వితీయ స్థానం అందే లీలా మాధురి 588 మార్కులు, తృతీయ స్థానం దూసనపూడి నాగవరలక్ష్మి 584 సాధించారని తెలిపారు. 500 మార్కులు పైబడి 14 మంది విద్యార్థులు సాధించారన్నారు.

టెన్త్‌లో విద్యార్థుల 'ప్రతిభ'

ప్రజాశక్తి - మొగల్తూరు


కొల్లాటి చైతన్యశ్రీ

విలువలతో కూడిన విద్యను అందించడంలో తమ పాఠశాల ముందుంటుందని ప్రతిభా పాఠశాల ప్రిన్సిపల్ మాలే సుష్మ తెలిపారు. పదో తరగతి పరీక్షలకు తమ విద్యార్థులు 51 మంది హాజరవ్వగా 49 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కొల్లాటి చైతన్యశ్రీ 573 మార్కులు, కొప్పినేని జ్ఞాన సాయి 568 మార్కులతో పాఠశాల టాపర్లుగా నిలిచారన్నారు. 500 మార్కులు పైబడి 20 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు.

మండల ఫస్టు కాళ్ల, కోపల్లె హైస్కూళ్ల విద్యార్థులదే

ప్రజాశక్తి - కాళ్ల


నిమ్మల యశస్విని

మండలంలో తమ విద్యార్థి అత్యుత్తమ మార్కులు సాధించి మండల ఫస్టు సాధించినట్లు కాళ్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జెఎల్ఎన్.శాస్త్రి తెలిపారు. నిమ్మల యశస్విని 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గంజల మౌనిక 573, కేతినీడి మధు మానస 567 మార్కులు సాధించి స్కూల్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. 97 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 87 మంది ఉతీర్ణులయ్యారని, 19 మంది 500కుపైగా మార్కులు సాధించారని వివరించారు.


లిఖిత దుర్గ

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కోపల్లె జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు 76 శాతం ఫలితాలు సాధించారని ప్రధానోపాధ్యాయిని కె.నిర్మలాదేవి తెలిపారు. తమ విద్యార్థిని సాధనాల లిఖిత దుర్గ 586 మార్కులు సాధించి మండలంలో మొదటిస్థానంలో నిలిచిందని తెలిపారు. 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 90 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వి.అలేఖ్య 556 మార్కులు, ద్వారపూడి శ్రీలక్ష్మి 554 మార్కులు సాధించి స్కూల్‌లో ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారన్నారు.


బుంగ హర్షిత


కొల్లాటి కోమలి


పేకేటి ఖ్యాతి ప్రియాంక

'విజ్ఞాన్'కు మండల సెకండ్

ప్రజాశక్తి - ఆకివీడు

పదో తరగతి ఫలితాల్లో విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి బుంగా హన్షిత 592 మార్కులతో మండలస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. శారద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని కొల్లాటి కోమలి 590 మార్కులతో ఆ స్కూల్ ఫస్టు, ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన పేకేటి ఖ్యాతి ప్రియాంక 590 మార్కులతో ఆ స్కూల్ ఫస్టు సాధించింది. చినకాపవరంలోని శ్రీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని వైదాని భార్గవి 574 మార్కులతో ఆ స్కూల్లో ప్రథమ స్థానం సాధించింది. ఇక శారద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చినకాపవరం శ్రీ విద్యానికేతన్ హైస్కూల్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి.

'పది'లో శ్రీవిద్య ప్రభంజనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీ విద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.లక్ష్మీభవాని తెలిపారు. తమ స్కూల్ నుండి 30 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అంతా ఉత్తీర్ణులయ్యారని, 18 మంది 500కుపైగా మార్కులు సాధించారని వివరించారు. జి.భాస్కర్ 581 మార్కులతో స్కూల్ ఫస్టు సాధించారని చెప్పారు.

ఆదిత్య విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్


ఎంఎస్.నాగ శివాని

తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగించారని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు తెలిపారు. స్కూల్లో అభినందన నిర్వహించారు. ఎంఎస్.నాగ శివాని 587 మార్కులు సాధించి స్కూల్ ఫస్టు సాధించారన్నారు. 124 మంది 500కు పైగా మార్కులు సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కృష్ణంరాజుతోపాటు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, కెవి.సత్యనారాయణ, బి.యుగంధర్, దుర్గారావు, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం, కొణితివాడ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25న మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల మండలంలోని వీరవాసరం, రాయకుదురు, కొణితివాడ, నవుడూరు, మడుగు పోలవరం, నేలపోగులు, అండలూరు పంజావేమవరం, తోలేరు పడమటిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పాత కక్షలతో కత్తితో దాడి

ఘటనా స్థలంలోనే మృతి చెందిన కత్తుల పోలు

కొంతేరులో ఘటన

యలమంచిలి: పాత కక్షల నేపథ్యంలో మండలంలోని కొంతేరు గ్రామంలో బుధవారం రాత్రి ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటనలో కత్తుల పోలు (58) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య కత్తుల జానకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంతేరు గ్రామం ఆకులవానిగరువు కట్టా వారి పుంత వద్ద ఎదురు బదురు ఇళ్లల్లో నివాసం ఉంటున్న బత్తుల యేసుదాసు (పెద్దబ్బులు) కత్తుల పోలు కుటుంబాల మధ్య కొన్ని సంవత్సరాలుగా మనస్పర్థలు ఉన్నాయి. అప్పుడప్పుడు గొడవలు పడుతూ ఒకరు ఒకరు దూషించుకుంటున్న నేపథ్యంలో బుధవారం రాత్రి కత్తుల పోలు కుటుంబం ఇంట్లో నిద్రిస్తుండగా బత్తుల ఏసుదాసు అతని భార్య భారతి ఇంటికి వచ్చి తలుపులు కొట్టడంతో పోలు భార్య తలుపులు తెరిచింది. దీంతో ఏసుదాసు తన భార్యను వెంటబెట్టుకొని కత్తితో ఇంట్లోకి ప్రవేశించాడు. భయభ్రాంతులకు గురైన పోలు భార్య భారతి కేకలు వేసుకుంటూ తన అల్లుడిని తీసుకురావడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేలోపు మంచంపై నిద్రిస్తున్న పోలు మెడపై ఏసుదాసు కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనలో పోలు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఫిర్యాదులో తెలిపారు. పోలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించి నిందితులు బత్తుల ఏసుదాసు, అతని భార్య భారతిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గురువారం ఉదయం నరసాపురం డిఎస్‌పి శ్రీ వేద పోలు మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

లంకలకోడేరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సిహెచ్ శ్రీనివాసును అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. అతని వద్ద నుండి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు పి.మహేష్, జి.రఘు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం సబ్ డివిజన్‌లో పోలీస్ యాక్ట్ : డిఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం



నరసాపురం సబ్ డివిజన్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతి భద్రతల దృష్ట్యా సబ్ డివిజన్ అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. బుధవారం (ఏప్రిల్ 23) నుంచి మే 23వ తేదీ వరకూ సబ్‌డివిజన్ అంతా అమల్లో ఉన్నట్లు డిఎస్‌పి జి.శ్రీవేద వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా సబ్ డివిజన్‌లో ఎలాంటి బహిరంగ సమావేశాలు గానీ, ఊరేగింపులు, ధర్నాలు గానీ జరపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజెలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకున్న చర్యలకు అందరూ సహకరించాలని డిఎస్‌పి తెలిపారు.

'పది'లో విశ్వకవి విజయకేతనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్


విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ రఘుబాబు

పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని విశ్వకవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పొట్లూరి రఘుబాబు తెలిపారు. 18 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు సాధించారన్నారు. స్కూల్ వద్ద విద్యార్థులను అభినందించి వారికి బహుమతి చెక్కులను అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


వై.అవినాష్

పది ఫలితాల్లో పెదతాడేపల్లి బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షకు 76 మంది హాజరుకాగా 73 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 73 మందిలో ఎనిమిది మందికి 550లకు పైగా, 27 మందికి 500లకు పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. వై.అవినాష్ 574 మార్కులతో స్కూల్ టాపర్‌గా, 572 మార్కులతో ఎస్.రాఘవ సెకండ్ టాపర్‌గా, కె.రంజిత్ కుమార్ 560 మార్కులతో థర్డ్ టాపర్‌గా నిలిచారన్నారు. వీరిని డిఇఒ ఎస్ఎల్.నారాయణ, ఎపిసి శ్యాంసుందర్, వైస్ ప్రిన్సిపల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు అభినందనందించారు.

శ్రీచైతన్య విజయకేతనం

ప్రజాశక్తి - నరసాపురం


డి.జెస్వింత్

పది ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. దొండపాటి జెస్వింత్ 600 మార్కులకు గాను 597 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ పొందాడని రీజనల్ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్ తెలిపారు. మాదాసు లక్ష్మి 593, అనంతపల్లి వెంకట రాజా అభినయ్ 592 సాధించారన్నారు. 500లకు పైబడి మార్కులు 68 మంది సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బందిని రీజనల్ ఇన్‌ఛార్జి రాజ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ బిజెవి వేణుగోపాల్‌రావు, స్కూల్ డీన్ కృష్ణంరాజు, ఇన్‌ఛార్జి ఆలీను, స్కూల్స్ ఎజిఎం ఎస్.పార్థసారథి అభినందించారు.

'ఆదిత్య' ప్రభంజనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


ఎం.మేఘన

పది ఫలితాల్లో మహాలక్ష్మీనగర్ రోడ్డులోని ఆదిత్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ ప్రిన్సిపల్ కె.వాసుదేవ తెలిపారు. ఎం.మేఘన 587 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చినట్లు తెలిపారు. పరీక్షకు హాజరైన 62 మందిలో ఐదుగురు విద్యార్థులు 575 మార్కులకు పైబడి, 34 మంది 500లకు పైబడి మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ నల్లమిల్లి శృతిరెడ్డి, లోకల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి

డిఎన్ఆర్ కళాశాల జాయింట్ సెక్రటరీ రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం

ఉన్నత విద్య అభ్యసించడానికి ఇంగ్లీష్ అవసరమని,విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని డిఎన్ఆర్ కళాశాల జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణంరాజు అన్నారు. స్థానిక డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఇంగ్లీష్ తరగతులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటరామరాజు ఫోన్లో విద్యార్థులకు సందేశం ఇస్తూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో, అంతర్జాతీయంగా రాణించాలంటే ఇంగ్లీష్ అవసరమన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ శిక్షణ తరగతులు 10 రోజుల పాటు జరుగుతాయన్నారు. భీమవరం పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షులు వెంకటపతి రాజు, మానవత సభ్యులు కెవిఎస్ఎన్.రాజు, ఝాన్సీ లక్ష్మి, గోపాలశర్మ, హెచ్ఎం.సత్యమూర్తి, గెస్ట్ లెక్చరర్ సత్యనారాయణ రాజు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ఎస్ఎన్.రాజు, భీమవరం యూనిట్ ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, వసుధ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన కవలలు

ప్రజాశక్తి - నరసాపురం


కవలలతో తల్లిదండ్రులు

నరసాపురానికి చెందిన కవలలు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపారు. పాలకొల్లులో చైతన్య స్కూల్లో చదువుతున్న జి.షేన్ షెర్విన్ 589, జి.షేన్‌రోవిన్‌కు 588 మార్కులు వచ్చాయి. ఇద్దరి మధ్య ఒక మార్కు తేడా రావడం విశేషం. వీరి తండ్రి గంగులూరి రవి కుమార్ నరసాపురం మండలంలోని యర్రంశెట్టి వారి పాలెం చవ్వాకుల వారి మెరక ఎంపిపి స్కూల్లో టీచర్, తల్లి అనిత నరసాపురం గాంధీ నగర్ సచివాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు.

హాస్టల్ విద్యార్థినుల హవా


ప్రజాశక్తి - నరసాపురం


కొల్లాటి శ్రావ్య

పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం విద్యార్థులు పది ఫలితాల్లో ప్రతిభ చూపారు. హాస్టల్లో 12 మంది విద్యార్థులు ఉండగా 12 మంది పాసై నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని హాస్టల్ వార్డెన్ వి.కనక దుర్గా భవాని తెలిపారు. పట్టణంలోని మిషన్ హైస్కూల్‌లో చదువుతున్న కొల్లాటి శ్రావ్య 549 మార్కులు సాధించి స్కూల్ ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రత్తిపాటి షైనీ 546, నురికుదిటి ప్రేమలత 545 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. జిల్లా ఎస్‌సి సంక్షేమ, ఎంపోర్‌మెంట్ అధికారి బి.రామాంజనేయ రాజు, నరసాపురం సహాయ సంక్షేమ అధికారి కె.బాలు సాధన విద్యార్థులను అభినందించారు.

యర్రంశెట్టివారిపాలెం విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి - నరసాపురం


విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

యర్రంశెట్టివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మండలస్థాయిలో తెలగంశెట్టి లక్ష్మీదీప్తి 580 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. పితాని రమ్యశ్రీ 523, కొండా నరేంద్రకుమార్ 521, కోనపరెడ్డి వెంకటలక్ష్మి 526 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించారు. గ్రామ సర్పంచి నాగ ముత్యమాంబబాబులు ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నందున ఈ పాఠశాల మండల స్థాయిలో గుర్తింపు పొందిందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, ఎంఇఒ పి.పుష్పరాజ్యం హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి శ్రీదేవివాసు, కె.రఘురాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్


విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి

భీమవరం పట్టణ పురపాలక సంఘం పరిధిలోని ఆరు హైస్కూల్లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అభినందించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ భీమవరం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పాఠశాలలో మధ్యతరగతి, పేద విద్యార్థులు ఎక్కువగా ఉన్నప్పటికీ 583 మార్కులు సాధించడం గొప్ప విశేషమన్నారు. అనంతరం 12 మంది విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ఆయా హైస్కూల్ హెచ్ఎంలు కె.వెంకటరావు, పిబి.శ్రీనివాస్, సత్యనారాయణ, వారణాసి రాధాకృష్ణ, విశ్వనాథ రాజు మురళీ పాల్గొన్నారు.

సత్యనారాయణ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఆచంట

కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి ముత్యాలవారిపాలెం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ ముత్యాల సత్యనారాయణ కుటుంబానికి రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సిర్రా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వశిష్ట గోదావరిలో ప్రమాదవశాత్తూ ఉపాధి కూలీ మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన మృతితో భార్య, ఆరుగురు కుమార్తెలు ఒక కుమారుడితో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారులు తక్షణం స్పందించి బాధిత కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం అందించాలని కోరారు.

ధాన్యం సొమ్ము చెల్లింపుల్లో రికార్డు

గురువారం కొనుగోలు చేసిన ధాన్యం సొమ్మే పెండింగ్

ఇప్పటి వరకూ రూ.450 కోట్లు చెల్లింపు

సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్

ప్రజాశక్తి - పెంటపాడు

ఇప్పటి వరకు జిల్లాలో 261 రైతు సేవా కేంద్రాల ద్వారా 21,920 మంది రైతుల నుండి రూ.479 కోట్లు విలువైన 2,07,721 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రూ.450 కోట్లు సొమ్మును రైతులకు చెల్లించారని, గురువారం కొనుగోలు చేసిన ధాన్యం నగదు రూ.29 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించాల్సి ఉందనిజిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి శివరామ ప్రసాద్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం చెల్లింపుల్లో ఇదొక రికార్డని చెప్పారు. గురువారం పెంటపాడు మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ట్రక్ షీట్, ఫండ్ ట్రాన్సఫర్ ఆర్డర్ (ఎఫ్‌టిఒ) జనరేషన్ తగు సమయానికి చేయుచున్నారో లేదో పరిశీలించారు. జిల్లాలో ఎక్కడా సంచులు కొరత లేదన్నారు. ఆయన వెంట తాడేపల్లిగూడెం ఎడిఎ తాడేపల్లిగూడెం మురళీకృష్ణ, తహశీల్దార్ సీతామహాలక్ష్మి, వ్యవసాయాధికారి పార్థసారథి, కోఆపరేటివ్ అధికారి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - యలమంచిలి

పాలకొల్లు నియోజకవర్గంలో రూ.80 కోట్ల జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన గురువారం మండలంలో మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో రూ.రెండు కోట్ల 20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.29 లక్షలతో చింతదిబ్బలో నక్కల కల్వర్టు వద్ద నక్కల మేజర్ డ్రెయిన్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన, మరో రూ.25.30 లక్షలతో మైనర్ డ్రెయిన్ల తవ్వే పనులు ప్రారంభించారు. రూ.21.75 లక్షలతో నార్నిమెరకలో ఇలపకుర్రు ఛానల్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, రూ.27.50 లక్షలతో నార్నిమెరకలో గ్రామ పంచాయతీ దగ్గరలో జల జీవన్ మిషన్ తాగునీటి పనులకు, రూ.34.40 లక్షలతో గంగడుపాలెం గ్రామంలో గ్రామ పంచాయతీ దగ్గరలో జల జీవన్ మిషన్ తాగునీరు, తదితర పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున పనులు చేపడుతున్నామన్నారు. రైతాంగానికి మేలు జరిగే పనులకు ప్రాధాన్యతనిస్తూ రూ.42 కోట్లతో పలు అభివద్ధి పనులు సరవేగంగా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో కంచుస్తంభం పాలెం నుంచి బాడవ వరకు గోదావరి ఏటిగట్టును పటిష్ట పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం నాని, నీటి సంఘం అధ్యక్షులు ఆరిమిల్లి రామశ్రీనివాస్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి : జెసి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అర్జీదారులు 80 శాతం సంతృప్తికరంగా ఉన్నారని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జెసి పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం, రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్లు, విఆర్‌ఒలతో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తు దారిని, సరిహద్దుదారుని, గ్రామ పెద్దలను కలిసి సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దరఖాస్తు చేసుకున్న వారు సమస్యల పరిష్కారంలో 80 శాతం సంతృప్తికరంగా ఉన్నారని అన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు అయితం సత్యనారాయణ, రాజ్ కిషోర్, వై.దుర్గాకిషోర్, గ్రంధి పవన్, జి.అనిత కుమారి పాల్గొన్నారు.


సూర్యారావు చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న సిపిఎం నేతలు

సూర్యారావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సుదీర్ఘ కాలంపాటు సిపిఎంలో కార్యకర్తగా, స్థానిక నాయకునిగా పార్టీకి, ప్రజలకు తూటే సూర్యారావు అందించిన సేవలు మరువరానివని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ఆకుల హరేరామ్ అన్నారు. గురువారం పొలమూరులో సూర్యారావు స్వగృహం వద్ద జరిగిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 85 సంవత్సరాల వరకూ సిపిఎం సీనియర్ సభ్యులుగా కొనసాగుతూ అనేక ప్రజా, కార్మిక ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ముందుగా ఆయన చిత్ర పటానికి సిపిఎం సీనియర్ నాయకులు పెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడారు. పార్టీలో సభ్యునిగా చేరింది మొదలు సుమారు 45 సంవత్సరాలు పార్టీ సభ్యుడిగా తూటే కొనసాగారన్నారు. ప్రజా సమస్యలపై సూర్యారావు శ్రద్ధతో పని చేశారని తెలిపారు. ఆయన ఇద్దరుకు కుమారులు ఉండగా, వారి మనవడు తూటే సురేష్ తాత బాటలో సిపిఎం కార్యకర్తగా పనిచేస్తున్నారన్నారు. సిపిఎం పొలమూరు గ్రామ కమిటీ సభ్యులు, పెనుమంట్ర మండల కమిటీ సభ్యులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బల్ల చిన్నవీరభద్రం, చింతపల్లి తిరుమలరావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు కేతా పద్మజ, కేతా ప్రమోద్, కుసంపూడి సుబ్బారాజు, నేతల చిత్తరంజన్, పెచ్చెట్టి సత్యనారాయణ, పిల్లి రాజారావు, పంపన సూర్యనారాయణ, కె.శ్రీరామ్మూర్తి, కట్టా సత్యం, రాపాక ఆశీర్వాదం, తూటే సురేష్, కాటిక వెంకటేశులు నివాళు లర్పించారు.

ఆక్వా సాగు విరామానికి 3 గ్రామాల రైతులు సిద్ధం

ప్రజాశక్తి - పాలకొల్లు

భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల పంట విరామం కోసం సంఘ కార్యవర్గ సభ్యులు గురువారం పాలకొల్లులోని సంఘ కార్యాలయం భవనంలో రైతులతో చర్చించారు. మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం, చందపర్రు గ్రామాల ఆక్వా రైతులతో సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు మాట్లాడారు. దీనికి రైతులు ముందుకొచ్చారు. పంట వేసి తీవ్రంగా నష్టపోతున్నామని, జూన్ నుంచి మూడు నెలలు పంట విరామం పాటించడానికి రైతులు సుముఖత వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు, ఆగర్రు మాజీ సర్పంచి తదితరులు మాట్లాడారు.

వికలాంగులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

వికలాంగులకు అండగా ప్రభుత్వం ఉందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం పిప్పర భవిత కేంద్రంలో వికలాంగులకు అవసరమైన ఉచిత ఉపకరణాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల జీవన స్థితిని మెరుగుపర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం స్థానిక ఎంపిపి పాఠశాలలో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అలాగే గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి వీలుగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫారంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, ఉంగుటూరు ఎఎంసి ఛైర్మన్ కె.జ్యోతి, కూటమి నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

ఆచంట : సమగ్ర శిక్ష ద్వారా ప్రతి సంవత్సరం 18 సంవత్సరాల్లోపు వికలాంగులకు వైకల్య నిర్ధారణ క్యాంపులు నిర్వహించి ఉచిత ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు ఎ.ఉషారాణి, పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆచంటలో వికలాంగ విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ఉచిత ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడారు. కార్యక్రమంలో ఐఇడిఎస్ఎస్ ప్రత్యేక ఉపాధ్యాయులు కె.దానేశ్వరావు, కె.నాగమణి, ఐఇఆర్‌పిలు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టాన్ని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

గ్రామ పంచాయతీలు పటిష్టంగా పనిచేయాలంటే పంచాయతీ రాజ్ చట్టాన్ని బలోపేతం చేయాలని సచివాలయ కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి మూర అలంకారం అధ్యక్షత వహించారు. సమావేశంలో సతీష్ మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిన పంచాయతీ రాజ్ చట్టంలో పొందుపర్చిన హక్కులు ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మూడో సచివాలయ కార్యదర్శి ఎ.భాస్కర్, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పంచాయతీ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎంఇఒ ఎ.రవీంద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, గ్రామస్తులను అలరించాయి. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించి వారికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్‌లను అందించారు. అమ్మకు వందనం కార్యక్రమంలో విద్యార్థులు తమ తల్లుల పాదాలను కడిగి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకట సుబ్బరాజు, ఎస్ఎంసి ఛైర్మన్ తెనాలి అశోక్‌బాబు, ఉపాధ్యాయులు బిఆర్ఎంకె.స్వామి, ఎన్.విజయలక్ష్మి, దాతలు బాతు మాణిక్యాలరావు, భూపతి రాజ్‌కుమార్, మేడేపల్లి ఇజ్రాయిల్, కమతం ప్రదీప్, బాతు రామస్వామి పాల్గొన్నారు.

కళ్యాణ మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

కాళ్ల: కాళ్లకూరులోని వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి కళ్యాణ మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు గురువారం పెదఅమిరంలో ఆవిష్కరించారు. కళ్యాణ మహోత్సవాలు మే 6 నుంచి 14వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ వివరించారు. కాళ్లకూరు గ్రామ మాజీ సర్పంచి అడ్డాల శివరామరాజు, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ దాట్ల వెంకటరామరాజు పాల్గొన్నారు.

కుళాయి చెరువు పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం

పురపాలక సంఘం 2 వార్డు శ్రీహరిపేటలోని ప్రధాన రక్షిత మంచి నీరు సరఫరా విభాగాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. తాగునీటి చెరువు ప్రాంగణం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఆలం, క్లోరిన్ నిల్వలను, సిబ్బంది హాజరు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రవీణ్ చంద్ర, ఎఇ కిషోర్, శానిటీర ఇన్‌స్పెక్టర్ పాత్రుడు పాల్గొన్నారు.

జనసేన నేత తాతరాజు మృతి

భీమవరం టౌన్: జనసేన నేత గాదిరాజు వెంకట సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు, (54) బుధవారం మృతి చెందారు. ఆయన ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో చికిత్స చేయించినప్పటికీ ప్రయోజనం కనపడలేదు. హైదరాబాద్ ఆసుపత్రిలో బుధవారం ఆయన మృతి చెందారు. ఆయన గతంలో వైసిపి వైసిపి కౌన్సిలర్‌గా పనిచేశారు. తదితర పదవులు చేపట్టారు. తాతరాజు మృతికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, పట్టణ ప్రముఖులు తోట సత్యనారాయణ, తదితరులు సంతాపం తెలిపారు.